నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I హైదరాబాద్, శనివారం 5 అక్టోబర్ 2024 SIDDIPET




బ్రహ్మచారిణి (గాయత్రీ దేవి)రూపంలో అమ్మవారు

## బ్రహ్మచారిణిగా ఏడుపాయల దుర్గమ్మ

పాపన్నపేట, అక్టోబర్4: దేవీ శరన్నరాత్రుల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం ఏడుపాయల వనదుర్గా భవాని మాతను గులాబీ రంగు వస్త్రాలతో బ్రహ్మచారిణి (గాయత్రీ దేవి )రూపంలో అలంకరించారు. వేకువజాము నుంచి ఆలయ పూజారులు శంకర్‌శర్మ, పార్థివశర్మ, రాజశేఖర్ శర్మ రాజగోపురంలో అమ్మవారికి అభిషేకం,అర్చన నిర్వహించి గులాబీ రంగు వస్త్రాలతో గాయత్రీమాతగా అలంకరించారు. గోకుల్ షెడ్‌లో సైతం అమ్మవారిని బ్రహ్మచారిణి మాతగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో చంద్రశేఖర్ తమ సిబ్బందితో ఏర్పాట్లు చేశారు. మూడో రోజు తదియ పూర్కరించుకుని నీలం వస్త్రాలంకణలో చంద్ర ఘంట(అనపూర్ణ)అమ్మవారిగా దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. భక్తులకు అన్నదానం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

### సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 4: రోడ్డు ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతపై జిల్లాస్థాయి అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి కృషి చేయాలన్నారు. అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి నివారించాలన్నారు. లక్డారం, కంది, నోవాపాన్, ముత్తంగి స్వీట్ హార్ట్ కార్నర్, రుద్రారం గీతం రోడ్డు, కవలంపేట, మామిడిపల్లి ఎక్స్ రోడ్డు వంటి ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం ప్రధాన సమస్యగా మారిందని, ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రహదారి పక్కన వెలసిన అక్రమ నిర్మాణాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటిని వెంటనే తొలిగించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే సహాయ చర్యలు అందేలా చర్యలు తీసుకోవాలని, హైవేల అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. 108 సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ..అతివేగం కారణంగా ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వేగం పరిమితికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్, రహదారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న జలాలు

## సింగూరుకు కొనసాగుతున్న వరద

### రెండు గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల

పుల్కల్, అక్టోబర్ 4 : సంగారెడ్డి జిల్లాలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. శుక్రవారం రెండు గేట్ల ద్వారా అధికారులు 22,254 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. విద్యుదుత్పత్తి కోసం జెన్కోకు 2677 క్యూసెక్కులను విడుదల చేశారు. శుక్రవారం 19,488 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 22,254 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా, 29.678 టీఎంసీల నీరు ఉన్నట్లు తెలిపారు.

## మంత్రాల నెపంతో వృద్ధురాలిపై దాడి





కాట్రియాల గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన ముత్తవ్వ (ఫైల్)

### రామాయంపేట దవాఖానలో మృతి

రామాయంపేట, అక్టోబర్ 4: మంత్రాలు చేస్తుందనే అనుమానంతో ఓ వృద్ధురాలి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాలలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...కాట్రియాలకు చెందిన డ్యాగల ముత్తవ్వ(55) కొంతకాలంగా తమ కుటుంబ సభ్యులపై బాణామతి చేస్తుందని గ్రామానికి చెందిన పదిమంది వ్యక్తులు మూకుమ్మడిగా ఆమె ఇంటికి వెళ్లి విచక్షణారహితంగా దాడి చేశారు. అనంతరం ఆమెను బయటకు తీసుకువచ్చి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు గ్రామానికి చేరకున్నారు. తీవ్రగాయాలైన ముత్తవ్వను 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవా రం మృతిచెందిం ది. తూప్రాన్ డీఎ స్పీ వెంకట్‌రెడ్డి కాట్రియాలకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తోటి మహిళపై దాడి జరుగుతుంటే మీరేం చేశారంటూ మృతురాలు ఇంటి పక్కనే ఉన్న స్థానికులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమారెడ్డి రామాయంపేట మార్చురీలో వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలించి కాట్రియాలకు చేరుకున్నారు. నిందితులను చట్ట ప్రకా రం శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు జరిగితే సహించమని ఆయన హెచ్చరించారు. ఎస్పీ వెంట రామాయంపేట సీఐ వెంకట రాజగౌడ్, ఎస్సై బాలరాజు, సిబ్బంది తెలిపారు.

### ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మవద్దు: ఎస్పీ

మెదక్ అర్బన్, అక్టోబర్ 4: ఆధునిక కాలంలో మంత్రాలు, మూఢ నమ్మకాలను నమ్మవద్దని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ప్రపంచం సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు పెడుతున్న తరుణంలో ఇలా మూఢ నమ్మకాలైన చేతబడి, బాణామతి, మంత్రాల నెపంతో ఒక మహిళను అత్యంత దారుణంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పంటించి చంపడం చాలా దారుణమయిన విషయమని అన్నారు. ఈ సంఘటన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, మూఢ నమ్మకాలపై మెదక్ జిల్లా పోలీస్ కళా బృందం ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మవద్దని, దీనికి అసనమ్మకమే బలమైన కారణమని, ఆరోగ్య సమస్యలు అనేవి వారు నివసించే పరిసరాలు, వాతావరణ మా ర్పు, జన్యు సంబంధమైన కారణాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

## నల్లవాగును సందర్శించిన ఉగాండా బృందం



ఉగాండా బృందాన్ని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

సిర్గాపూర్, అక్టోబర్ 4: సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టును ఉగాండా దేశానికి చెందిన అధికారుల బృందం శుక్రవారం సాయంత్రం సందర్శించింది. ఇక్రిశాట్‌ను సందర్శించిన ఈ బృందం ఈ ప్రాంతంలోని మధ్యతరహా, చిన్నతరహా ప్రాజెక్టులను సందర్శించి అధ్యయనం చేశారు. అనంతరం ఆయకట్టు రైతులను బృందం కలిసింది. స్థానిక ఇరిగేషన్ అధికారులు బృందం సభ్యులకు అన్ని వివరాలు తెలియజేశారు. రైతులు, అధికారులు ఉగాండా బృందం సభ్యులను తలపాగా, శాలువాలతో సన్మానించారు. వారి వెంట డీఈఈ పవన్‌కుమార్, ఈఈ విజయ్ కుమార్ ఏఈలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మీన మేషాలు..!

- చెరువులకు చేరని చేపలు
- అక్టోబర్ వచ్చినా ఖరారు కాని టెండర్లు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 6.60 కోట్ల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- బీఆర్ఎస్ హయాంలో గతేడాది 13.22 కోట్ల పంపిణీ
- గతేడాది కన్నా ఈసారి తగ్గిన చేపపిల్లల పంపిణీ
- ఆందోళనలో మత్స్యకారులు.. ఉపాధి అవకాశాలకు దెబ్బ
- మొద్దు నిద్ర వీడని కాంగ్రెస్ సర్కారు



సిద్దిపేట, అక్టోబర్ 4(నమస్తే తెలంగాణప్రతినిధి): మత్స్యకారుల అభ్యున్నతికి బీఆర్ఎస్ హయాంలో ఏటా చెరువులు,కుంటలు, రిజర్వాయర్లలో చేపపిల్లలను వదిలి ఉపాధి అవకాశాలను కల్పించింది. కొన్నేండ్ల పాటు సబ్సిడీపై చేపి పిల్లలను నీటి వనరుల్లో వదలడంతో తెలంగాణలో నీలివిప్లవం సాకారమైంది. పల్లెలు, పట్టణాల్లో విరివిగా చేపలు లభించాయి. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో అక్టోబర్ నెల వచ్చినా ఇంతవరకు చేప పిల్ల చెరువుకు చేరలేదు. ఇంకా టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదు. టెండర్ల ప్రక్రియ పూర్తి అయ్యేది ఎప్పుడు..? చేప చెరువుకు చేరేది ఎప్పుడు..? చేపలు వృద్ధి చెందేది ఎప్పుడు..? యాసంగి సీజన్ ప్రారంభమైంది అంటే చెరువుల్లో నీటిశాతం తగ్గుతుంది. ఈ లోగ చేపలు వృద్ధి చెందుతాయా..? అన్న అనుమానాలు మత్స్యకారుల్లో నెలకొన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపపిల్లలను వందశాతం రాయితీతో అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా కోతలు పెట్టిందని మత్స్యకారులు చెబుతున్నారు. గతంలో పంపణీ చేసిన వారికి ఈ ప్రభుత్వం ఇంతవరకు డబ్బులు చెల్లించలేదు. ఈ ఏడాది ఇప్పటివరకు టెండర్ల ప్రక్రియ పూర్తికాలేదు. ఒప్పందాలు కాలేదు. ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి.

**గతేడాది కన్నా తక్కువే...**

ఉమ్మడి మెదక్ జిల్లాలో చేప పిల్లల పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.బీఆర్ఎస్ హయాంలో సకాలంలో టెండర్లు పిలిచి యాసంగి రాకముందే నీటి వనరుల్లో చేపపిల్లలను వదిలారు. ఈసారి ఆ పరిస్థితి లేదు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఈసారి సిద్దిపేట జిల్లాలో 1175 చెరువుల్లో 2.21 కోట్ల చేప పిల్లలు వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతేడాది బీఆర్ఎస్ హయాంలో 4.41 కోట్ల చేపపిల్లలను వదిలారు. మెదక్ జిల్లాలో ఈసారి 1654 చెరువుల్లో 2.62 కోట్ల విడుదల చేయనున్నారు. గతేడాది 5.25 కోట్ల చేపపిల్లలను వదిలారు. సంగారెడ్డి జిల్లాలో 1160 చెరువుల్లో 1.77 కోట్ల చేపపిల్లలను విడుదల చేయనున్నారు. గతేడాది 3.56 కోట్ల చేపపిల్లలను విడుదల చేశారు. మూడు జిల్లాల్లో గతేడాది కన్నా ఈసారి తక్కువ సంఖ్యలో చేపపిల్లలను వదలనున్నారు. గతేడాది ఉమ్మడి మెదక్ జిల్లాలో 13.22 కోట్లను చేపపిల్లలను వదిలితే, ఈసారి 6.60 కోట్లు మాత్రమే వదలనున్నారు. దీనికి కూడా ఇంకా సమయం పట్టనున్నది.

**జలాశయాల్లో నీళ్లున్నా..**

సిద్దిపేట జిల్లాలో 1175 చెరువులు, కుంటలు నిం డాయి. వీటితోపాటు అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లు నిండుకుండలా ఉన్నాయి. శనిగరం మధ్యతరహా ప్రాజెక్టుతోపాటు ఇతర జలాశయాలు నిండుకుండలా ఉన్నాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోనూ నీటి వనరులు కళకళలాడుతున్నాయి. సింగూరు, మంజీరా, వనదుర్గా, నల్లవాగు, హల్దీ, నారింజ ప్రాజెక్టులతోపాటు చెరువులు, కుంటలు జలాలతో నిండుగా మారాయి. ఈసారి ప్రభుత్వ విధానాలు లోపభూయిష్టంగా ఉండడంతో చేప పిల్లల టెండర్లకు కాంట్రాక్టర్లు అంతగా మొగ్గు చూపడం లేదని తెలిసింది. ఆన్‌లైన్ టెండర్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఉన్న వాటిని ఫైనల్ చేసే అవకాశం ఉంది. ఇప్పుడు టెండర్ల పూర్తి చేసి చెరువులను ఎంపిక చేసి చేప పిల్లలను పంపిణీ చేసే వరకు మరోనెల రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ కొద్ది సమయంలో చెరువులో చేప పిల్లలు అనుకున్న స్థాయిలో పెరిగేనా..? అన్న అనుమానాలు మత్స్యకారుల్లో నెలకొన్నాయి.

## డిజిటల్ సర్వే సమగ్రంగా చేపట్టాలి



సిద్దిపేటలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట, అక్టోబర్ 4: పకడ్బందీగా ఫ్యామిలీ డిజిటల్ సర్వే నిర్వహించాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేటలోని 34వ వార్డులో కొనసాగుతున్న ఫ్యామిలీ డిజిటల్ సర్వేను పరిశీలించారు. కుటుంబ వివరాలు సమగ్రంగా సేకరించాలని బృందాలకు సూచించారు. తప్పులులేకుండా సమాచారం సేకరించాలన్నారు. మున్సిపల్ ఏఈ యాదగిరి, కౌన్సిలర్ సంధ్యాశ్రీకాంత్ పాల్గొన్నారు.

**కొనసాగుతున్న డిజిటల్ సర్వే**

హుస్నాబాద్‌టౌన్, అక్టోబర్ 4: ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే హుస్నాబాద్‌లో శుక్రవారం కొనసాగింది. పట్టణంలోని 11వ వార్డులో డిజిటల్ సర్వేలో పలువురు అధికారులు పాల్గొని కుటుంబాల సమాచారాన్ని సేకరించారు. 11వ వార్డులో 315 కుటుంబాల్లో 80శాతానికిపైగా సర్వే నిర్వహించినట్లు తెలిపారు. పట్టణంలో జరుగుతున్న సర్వేను ఆర్డీవో రామ్మూర్తి పర్యవేక్షించారు. సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. కార్యక్రమంలో ము న్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్‌తోపా టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునిక సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబర్ 4: సిద్దిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత భవనంలో ఆధునిక సౌకర్యాలతో సైన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సైన్స్ ఫోరం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో ఆయన చర్చించారు. సైన్స్ సెంటర్ ఆవశ్యకత, ఎలా రూపొందించాలి, ఉండాల్సిన అంశాలు, సలహాలు, సూచనలు చేశారు. సైన్స్ సెంటర్‌లో ఉండే ప్రాజెక్ట్స్ వర్కింగ్ మోడల్ ఉండాలని, సైన్స్ సెంటర్ అనేది పాఠశాల, కళాశాల స్థాయికి, సమాజం నుంచి వచ్చే ప్రతిపౌరుడు నేర్చుకునే విధంగా ఉండాలన్నాచారు. కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాల్గొన్నారు.

**పనులు పూర్తి చేయాలి**

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. పాఠశాలల పురోగతిపై ఐడీవోసీలోని సమావేశం మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల ఆధునీకరణ పనుల ఎంబీలను సకాలంలో అందించేలా చూడాలన్నారు. ఇప్పటివరకు మంజూరైన పనులు, అందులో పూర్తయిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్ఆర్ ఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

## బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

సిద్దిపేట పట్టణంలో శుక్రవారం ముద్దపప్పు బతుకమ్మను మహిళలు ఘనంగా నిర్వహించుకున్నారు. సిద్దిపేటలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు కోమటి చెరువుపై బతుకమ్మలతో ఆడిపాడి సందడి చేశారు. పాత మార్కెట్ వద్ద మహిళలు బతుకమ్మ ఆడారు. చెరువులో బతుకమ్మల నిమజ్జనం అనంతరం పిండి వంటలు తిన్నారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 4



పాత మార్కెట్ వద్ద బతుకమ్మలను చూపుతున్న మహిళలు



డ్యాన్స్ చేస్తున్న నర్సింగ్ కాలేజీ విద్యార్థులు



బతుకమ్మలతో మహిళలు



సిద్దిపేట కోమటి చెరువు వద్ద బతుకమ్మలతో మహిళలు



కోమటిచెరువు వద్ద చిన్నారుల సందడి



సిద్దిపేట కోమటి చెరువు వద్ద బతుకమ్మలను నీళ్లల్లో వదులుతున్న మహిళలు



సిద్దిపేట కోమటి చెరువు వద్ద బతుకమ్మ ఆడుతున్న నర్సింగ్ కాలేజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు



సిద్దిపేట భరత్‌నగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నిమజ్జనం చేసేందుకు సిద్దిపేట కోమటి చెరువు వద్దకు బతుకమ్మలను తీసుకొస్తున్న మహిళలు

# 'చెత్త' శుద్ధి ఏదీ..!

- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీలో పేరుకుపోతున్న చెత్త
- కొత్త వార్డులకు మున్సిపల్ సేవలు కరువు
- ముత్తంగిలో సుచిరిండియా వద్ద భారీగా చెత్త డంపింగ్
- ఐడీఏ పాశమైలారం రోడ్డుమీదకు వస్తున్న చెత్త
- తడిపొడి పేరున తెచ్చి ఒకేచోట డంపింగ్
- ప్రారంభానికి ముందు కంపుకొడుతున్న ఐడీఏ రోడ్డు
- పోగైన చెత్తను తగులబెడుతున్న సిబ్బంది
- ఇబ్బందుల్లో ప్రజలు



ముత్తంగిలో ఐడీఏ రోడ్డుపైకి వచ్చిన చెత్త



చెత్త డంపింగ్‌తో కంపుకొడుతున్న గుంతలు

పటాన్‌చెరు, అక్టోబర్ 1: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీలో కొత్తగా విలీనమైన గ్రామాల్లో చెత్త నిర్వహణ అధ్వానంగా మారింది. ముత్తంగి గ్రామాన్ని సెప్టెంబర్ 3న తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. పంచాయతీనుంచి మున్సిపల్‌గా మారిన ముత్తంగిలో నెలరోజులుగా చెత్త నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. టన్నులకొద్ది వస్తున్న చెత్తను సుచిర్ ఇండియా వెంచర్ ముందు జేసీబీ గుంతల్లో వేస్తున్నారు. ముత్తంగి, ఇస్నాపూర్, పాశమైలారం వైపుగా వస్తున్న చెత్తవాహనాలన్నీ ఈ గుంతలో చెత్తను వేస్తున్నాయని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ఆ సర్వే నెంబర్లు ముత్తంగి గ్రామ పరిధిలో ఉండటంతో ఆ గుంతపై పూర్తి హక్కులు ఆ గ్రామానికే ఉన్నాయి. గతంలోనూ ఈ గుంతల్లో చెత్తను వేయడంతో ప్రజలు అభ్యంతరం పెట్టారు. అప్పుడు పంచాయతీ కార్యదర్శి చెత్తను డంప్ యార్డుకు తరలించి సిబ్బందిని పెట్టి ఎవరూ చెత్త వేయకుండా చేశారు. తెల్లాపూర్ పంచాయతీలో ముత్తంగి మేజర్ పంచాయతీని విలీనం చేయడంతో చుట్టుపక్కల ఉన్న చెత్తను తరలించే ఆటోవాలాలకు మళ్లీ అవకాశం లభించింది. మున్సిపల్ అధికారుల, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో భారీగా చేరిన చెత్తతో సుచిరిండియా ముందు పరిసరాలు దుర్గంధమయంగా మారాయి. ముత్తంగిలోని వివిధ కాలనీల్లో 17 ఆటోవాలాలు చెత్తను సేకరిస్తారు. తడి, పొడి చెత్త పేరున తెచ్చిన చెత్తను ఈ గుంతల్లో, రోడ్డు పక్కన వేస్తున్నారు. ఇప్పుడు పరిస్థితి ఎలా తయారైందంటే ముత్తంగి గ్రామం నుంచి పాశమైలారం , కర్ధనూర్ వెళ్లే రోడ్డు చెత్తతో కప్పబడి పోయింది. ప్రజలు ఈ దుర్గంధం భరించలేక చుట్టు తిరిగి ఆయా గ్రామాలకు ప్రయాణిస్తున్నారు. భారీగా పేరుకుపోయిన చెత్తను తగలబెట్టి పర్యావరణాన్ని పాడుచేస్తున్నారు. చెత్త తగల బెట్టినప్పుడు ప్రధాన రహదారిపైన ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. పొగతో రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. ఐడీఏ పాశమైలారం, కర్ధనూర్ ఓఆర్ఆర్ రోడ్డు ప్రారంభం కాకముందే ముత్తంగి చెత్తతో అధ్వానంగా మారింది. మున్సిపల్ సిబ్బందినే చెత్తను తగలబెడుతుండటం గమనార్హం. చెత్తను తగలబెట్టడంపై ఆంక్షలు పెట్టిన తెల్లాపూర్ మున్సిపాలిటీలో మాత్రం చెత్తను తగులబెడుతున్నారు.

**కొల్లూర్‌లో డంప్‌యార్డు ఉన్నా...**

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో మున్సిపల్ చెత్తను వేసేందుకు పెద్ద డంప్‌యార్డును నిర్మించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులనుంచి, గ్రామాలనుంచి తెచ్చిన తడి,పొడి చెత్తను తగులబెడుతున్నారు. ముత్తంగి నుంచి ఆటోల్లో కొల్లూరుకు తరలించాల్సి ఉన్నా 17 ఆటోవాలాలు దూరభారం ఉందని ఈ గుంతల్లోనే చెత్తను పారవేస్తున్నారు. ముత్తంగి నుంచి కొల్లూరు 10 కిలోమీటర్ల దూరం ఉండటంతో ఆటోవాలాలు అంతదూరం పోమని ఈ గుంతల్లోనే డంప్‌చేస్తున్నారు. మున్సిపాలిటీ తరపున చెత్తను వేస్తే రూ. 5వేల జరిమానా విధిస్తామని ప్రజలను హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు మాత్రం పెడుతున్నారు. మున్సిపల్ చెత్త నిర్వహణపై కమిషనర్ ఎలాంటి సమీక్ష నిర్వహించడం లేదు. ఇప్పటి వరకు పౌరసేవ సమాచారం ముత్తంగిలో అందుబాటులోకి తేలేదు. చెత్తలో పందికొక్కులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పంచాయతీలో ఉన్నప్పుడు అన్ని సేవలు పొందిన ప్రజలు ఇప్పుడు మున్సిపాలిటీగా మారడంతో కొత్తగా వస్తున్న సమస్యలను చూసి బెంబేలెత్తుతున్నారు. రోగాలు వ్యాప్తి చెందుతాయని ఆందోళన చెందుతున్నారు.

### కొల్లూరుకు తరలిస్తాం..

కొల్లూరులో డంప్‌యార్డుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ స్థలంలోనే ముత్తంగి గ్రామ చెత్తను తరలిస్తాం. చెత్తను తెచ్చే ఆటోడ్రైవర్లను కొల్లూరు వెళ్లాలని చెబుతున్నాం. దూరం అని ఇంధనం ఖర్చు కావాలని వారు డిమాండ్ పెట్టారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో చెత్తను కొల్లూరుకు పంపిస్తాం. చెత్తను తగులబెట్టవద్దని సిబ్బందికి సూచిస్తాం. పారిశుధ్యంపై ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాం. సంపూర్ణ పారిశుధ్యం అమలు చేస్తాం. పక్క గ్రామాలనుంచి వస్తున్న చెత్త ఆటోలను సీజ్ చేస్తాం.

- నవోద్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపల్ అధికారి, ఈవో ముత్తంగి